డెంగీతో అగ్రికల్చర్ అసిస్టెంట్ మృతి

వినోద్ (ఫైల్)

జీలుగుమిల్లి: అంకన్నగూడెం సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్ డెంగీతో సోమవారం మృతిచెందారు. మండల వ్యవసాయాధికారి గంగార్జు తెలిపిన వివరాల ప్రకారం బుట్టాయగూడెం మండలం సీతప్పగూడేనికి చెందిన కె.వినోద్(23) మండలంలోని అంకన్నగూడెం సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. వినోద్ వారంరోజులుగా జ్వరంతో బాధపడుతున్నారు. ఐటీడీఏ పరీక్షలు నిర్వహించగా డెంగీగా నిర్ధారణ అయింది. దీంతోపాటు కామెర్లు కూడా కావడంతో పరిస్థితి విషమించింది. వెంటనే కుటుంబ సభ్యులు మెరుగైన వైద్యంకోసం విజయవాడలోని ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందారు. వినోద్‌కు ఇంకా వివాహం కాలేదు. ఆయన మృతితో వ్యవసాయశాఖ, సచివాలయ సిబ్బంది దిగ్భ్రాంతికి గురయ్యారు.

దోసపాడు భూపోరు ఉధృతం..!

- చెరువు గట్టుకు గండి, చేపలు పట్టి నిరసన
- వ్యకాస జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆధ్వర్యంలో కదంతొక్కిన పేదలు
- మద్దతుగా కదలొచ్చిన సిఐటియు, రైతుసంఘాల నేతలు
- చెరువు వద్దే వంటావార్పు
- మా భూములు మాకివ్వాలంటూ నినాదాల హోరు

చేపల చెరువు గట్టుకు గండి కొడుతున్న నేతలు

చేపలు పడుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, అర్బన్

ఏలూరు జిల్లాలోని దెందులూరు మండలం దోసపాడు భూపోరాటం ఉధృతమైంది. వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ ఆధ్వర్యంలో భూబాధితులు సోమవారం కదంతొక్కారు. చేపల చెరువులో చేపలు పట్టి, గట్టుకు గండికొట్టి నిరసన తెలిపారు. దీనికి సిఐటియు, రైతుసంఘాల నాయకులు మద్దతు తెలుపుతూ కదిలిరావడంతో భూపోరు తారాస్థాయికి చేరింది. దోసపాడు గ్రామంలో దళితులకు సంబంధించిన వందలెకరాలకుపైగా అసైన్డ్ భూములను బడాబాబులు ఆక్రమించి ఆ భూముల్లో చేపల చెరువులు తవ్వి 20 ఏళ్లకుపైగా అనుభవిస్తున్నారు. చట్టప్రకారం అసైన్డ్ భూముల అమ్మకం, కొనుగోళ్లు చెల్లవు. అప్పట్లో తమ అమాయకత్వాన్ని ఆసరా చేసుకుని తమ భూములు కాజేశారని బాధితులు వాపోతున్నారు. సెంటుభూమి కూడా లేకుండా ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'మా భూములు మాకివ్వండి' అంటూ తహశీల్దార్, ఆర్‌డిఒ, జిల్లా కలెక్టర్, ఎంఎల్‌ఎ వరకూ సమస్యను తీసుకెళ్లారు. పోరాటంలో పాల్గొంటున్న దళితులను పోలీసులతో బెదిరించి, కేసులు పెట్టి దారికి తెచ్చుకోవాలని చూశారు. బాధితులు ఏమాత్రం తగ్గకపోవడంతో సమస్య పరిష్కరిస్తామంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అనేకసార్లు ధర్నాలు, ఆందోళనలు నిర్వహించినా ప్రభుత్వం పట్టించుకోని పరిస్థితి. దీంతో ఓపిక నశించిన బాధితులు చెరువులకు గండికొట్టాలని నిర్ణయించుకున్నారు. జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నడుం బిగించారు. ఈ కార్యక్రమానికి ఢిల్లీ నుంచి వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విచ్చేశారు. ఆయన ఆధ్వర్యంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కె.ఎస్.మహంకాళిరావు, సిహెచ్.మాధవ, అంగడి ప్రభాకరరావు, పెద్దఎత్తున బాధిత రైతులు నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. వలలు వేసి చేపలు పట్టి, గట్టుకు గండికొట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ అప్పటి వరకూ శాంతియుతంగా పోరాటం చేశామని, ఇక చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. అందులో భాగంగానే ఈ రోజు గండ్లు కొట్టడం జరిగిందన్నారు. దోసపాడు దళితులకు వెంటనే వారి భూములు అప్పగించాలన్నారు. సమస్యను వెంటనే పరిష్కరించకపోతే అఖిల భారత స్థాయికి సమస్యను తీసుకువెళ్తామన్నారు. అసైన్డ్ చట్టంలో మార్పులు చేసి పేదల భూములను జగన్ భూస్వాములకు కట్టబెట్టాలని చూడటం దారుణమన్నారు. ఇప్పటికైనా జగన్ పేదల పక్షమో.. భూస్వాముల పక్షమో తేల్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మా భూములు ఇవ్వాలని అడుగుతున్నా సమాధానం లేదు

ఘంటసాల పాపాయమ్మ, దోసపాడు, బాధితురాలు

మా కుటుంబానికి రెండున్నర ఎకరాల అసైన్డ్ భూమి ఇచ్చారు. వాటిని ఆక్రమించుకుని చేపల చెరువులు సాగు చేస్తున్నారు. మా భూములు మాకివ్వాలని రెండేళ్లుగా పోరాటం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. అధికారుల వద్దకు వెళ్లినా సమాధానం చెప్పడం లేదు. ప్రభుత్వం వెంటనే మా భూములు మాకిచ్చి న్యాయం చేయాలి.

మాటలతో కాలక్షేపం చేస్తున్నారు

చల్లా లాజర్ మణి, దోసపాడు

మా కుటుంబానికి రెండెకరాల అసైన్డ్ భూమి ప్రభుత్వం ఇచ్చింది. అప్పట్లో మాయమాటలు చెప్పి వశం చేసుకున్నారు. మా భూమి మాకివ్వాలని 2022 నుంచి పోరాటం చేస్తున్నాం. ధర్నాలు, ఆందోళనలు ఎన్ని నిర్వహించినా పట్టించుకోవడం లేదు. అందుకే చేపలు పట్టి, గండ్లు కొట్టి నిరసన తెలుపుతున్నాం. అధికారులు మాటలతో కాలక్షేపం చేస్తున్నారే తప్ప.. పట్టించుకోని పరిస్థితి నెలకొంది. ఇదే పరిస్థితి కొనసాగితే పోరాటం మరింత ఉధృతం చేస్తాం.

వెరిఫికేషన్ చేస్తానన్న తహశీల్దార్ పట్టించుకోవడం లేదు

దౌరు నాగేంద్రబాబు, దోసపాడు

ప్రభుత్వం ఇచ్చిన ఎకరా 25 సెంట్లు భూమి లేకుండాపోయింది. మా భూములు మాకు ఇవ్వాలని పోరాటం చేస్తున్నాం. మీ భూములు వెరిఫికేషన్ చేస్తామని తహశీల్దార్ తెలిపారు. ఇప్పటి వరకూ పట్టించుకోలేదు. 144 సెక్షన్ పెట్టి మమ్మల్ని ఆపుతున్నారు. వాళ్లు మాత్రం మా భూముల్లో పనులు చేసుకుంటున్నారు. అందుకే గండికొట్టి, చేపలు పట్టి నిరసన తెలుపుతున్నాం.

సెంటు భూమి కూడా లేదు

చవలమూడి కరుణ, దోసపాడు

ప్రభుత్వం ఇచ్చిన ఎకరం అసైన్డ్ భూమి పోయింది. సెంటు భూమి కూడా మా కుటుంబానికి లేకుండా పోయింది. మా భూములు మాకివ్వాలంటూ ఆందోళనలు, నిరసనలు చేస్తున్నా ప్రభుత్వం, అధికారులు పట్టించుకోవడం లేదు. మా గోడు ప్రభుత్వానికి పట్టడం లేదు.

ఆయిల్‌పామ్ రైతులతో మాట్లాడుతున్న లోకేష్

పామాయిల్ రైతులకు అండగా ఉంటాం

- సబ్సిడీ యంత్రాలు, ఉచితంగా మొక్కలు అందిస్తాం
- ఆయిల్‌పామ్ రీసెర్చ్ సెంటర్ బలోపేతానికి కృషి
- చింతలపూడి రైతులకు పరిహారం అందించి, ప్రాజెక్టు పూర్తి చేస్తాం
- రైతుల బాధలు పట్టని ఎంపీ, ఎంఎల్‌ఎ
- యువగళం పాదయాత్రలో నారా లోకేష్
- చింతలపూడిలో మరోసారి ఉద్రిక్తత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, చింతలపూడి

టిడిపి అధికారంలోకొచ్చాక పామాయిల్ రైతులకు అండగా ఉంటామని, సబ్సిడీపై యంత్రాలు, ఉచితంగా మొక్కలు అందించడంతోపాటు, పామాయిల్ బోర్డు ఏర్పాటుకు కృషి చేస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ తెలిపారు. సోమవారం 197వ రోజు యువగళం పాదయాత్ర చింతలపూడి నియోజకవర్గంలో సాగింది. సుందరరావు పేటలో ప్రారంభమై లింగపాలెం, జూబ్లీనగర్, వెలగపల్లి, ఫాతిమాపురం, చింతలపూడి మీదుగా తీగలవంచ గ్రామం వరకూ సాగింది. రాత్రికి అక్కడ బస చేశారు. జనం పెద్దఎత్తున తరలిరావడంతో రోడ్లన్నీ కిక్కిరిసిన పరిస్థితి నెలకొంది. అడుగడుగునా ఘనస్వాగతం పలికారు. పాదయాత్రలో లోకేష్‌ను కలిసిన లింగపాలెం గ్రామస్తులు, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ బాధిత రైతులు, చింతలపూడి నగర పంచాయతీ ప్రజల సమస్యలపై వినితిపత్రాలు అందించారు. చింతలపూడిలో పామాయిల్ రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలోనూ లోకేష్ మాట్లాడారు. పామాయిల్ రైతులకు జగన్ చేసింది సున్నా అన్నారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదని, వైసిపి ప్రభుత్వం, ఎంపీలు, ఎంఎల్‌ఎలు పట్టించుకోవడం లేదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పామాయిల్ రీసెర్చ్ సెంటర్‌ను బలోపేతం చేస్తామన్నారు. ఇతర దేశాల్లో మాదిరిగా రికవరీ శాతం వచ్చేలా అన్ని చర్యలూ చేపడతామన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే కొత్త పామాయిల్ ఫ్యాక్టరీ పెట్టి రికవరీ రేటును పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. అధికారంలోకి వచ్చేది టిడిపి అని, కేంద్రంలో కూడా టిడిపి మద్దతిచ్చే పార్టీనే అధికారంలోకి వస్తుందని తెలిపారు. సబ్సిడీపై డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, యంత్రాలు అందిస్తామన్నారు. మిషన్ మోడల్ ఆయిల్‌పామ్ పంటను ప్రోత్సహిస్తామన్నారు. రైతు కళ్లలో ఆనందమే టిడిపి లక్ష్యమన్నారు. పామాయిల్ పెట్టుబడి తగ్గించి గిట్టుబాటు ధర వచ్చేలా టిడిపి బాధ్యత తీసుకుంటుందన్నారు. పామాయిల్ బోర్డు ఏర్పాటు చేయాలన్న ఆలోచన ఉందన్నారు.

సమస్యలపై జనం వినతులు

చింతలపూడి నగర పంచాయతీలో రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయని, సీసీ రోడ్లు ఆగిపోయాయని, యువతకు పరిశ్రమలు పెట్టి ఉద్యోగాలు కల్పించాలని, తాగునీటి పైప్‌లైన్ కలుషితమవుతుందని, కొత్త పైప్‌లైన్ వేయాలని, చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి రైతులను ఆదుకోవాలని, శ్మశాన వాటికలకు రక్షణ గోడ నిర్మించాలని, చింతలపూడి బస్సు డిపో ఏర్పాటు చేయాలని పలు సమస్యలను వినతిపత్రంలో ప్రస్తావించారు. చింతలపూడి ప్రాజెక్టు బాధిత రైతులు కలిసి ఎకరానికి రూ.30 లక్షలు ఇస్తామని ప్రస్తుత ఎంఎల్‌ఎ, ఎంపీ ప్రతిపక్షంలో ఉండగా పోరాటం చేసి పట్టించుకోవడం లేదన్నారు. మా భూములను 22ఎ పరిధిలో పెట్టడంతో భూములు అమ్ముకోవడంగాని, తాకట్టు పెట్టుకోవడం కూడా చేయలేకపోతున్నామని చెప్పారు. టిడిపి అధికారంలోకొచ్చాక న్యాయం చేయాలన్నారు. లింగపాలెం గ్రామస్తులు వినతిపత్రంలో పలు సమస్యలను ప్రస్తావించారు. గ్రామంలో రహదారుల పరిస్థితి అస్తవ్యస్తంగా ఉందని, చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేయాలని, రైతులకు గతంలో ఇచ్చిన సబ్సిడీ పథకాలు పునరుద్ధరించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. ప్రజల సమస్యలపై లోకేష్ మాట్లాడారు.

ఎంపీ పట్టించుకోరు.. ఎంఎల్‌ఎ గురించి మాటలు అనవసరం

పామాయిల్ రైతులు సమస్యలతో సతమతమవుతున్నా స్థానిక ఎంపీ పట్టించుకోవడం లేదని, వస్తున్నాం, వెళ్తున్నాం అన్నట్లు వ్యవహరిస్తున్నారని లోకేష్ విమర్శలు గుప్పించారు. ఎంఎల్‌ఎ గురించి మాట్లాడటం అనవసరం అని వ్యాఖ్యానించారు.

చింతలపూడిలో మరోసారి ఉద్రిక్తత

లోకేష్ యువగళం పాదయాత్రలో వైసిపి కవ్వింపు చర్యలు కొనసాగాయి. నూజివీడు మండలంలో కవ్వింపు చర్యలతో ఉద్రిక్తత వాతావరణం చోటుచేసుకోగా చింతలపూడిలో మరోసారి అదే పరిస్థితి నెలకొంది. జగనన్న నువ్వేకావాలి అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం తోపాటు చింతలపూడి వైసిపి కార్యాలయం వద్దకు యాత్ర చేరుకోగానే జై జగన్ అంటూ వైసిపి కార్యకర్త ఒకరు నినాదాలు చేయడంతో టిడిపి కార్యకర్తలు డ్యాన్సులు చేశారు. దీంతో కొద్దిసేపు ఉద్రిక్తత ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశం చేసి పరిస్థితిని చక్కదిద్దారు.

నేడు పాదయాత్ర ఇలా

మంగళవారం ఉదయం ఎనిమిది గంటలకు తీగలవంచ నుంచి పాదయాత్ర ప్రారంభమై పోలవరం నియోజకవర్గంలోకి ప్రవేశిస్తోంది. టి.నరసాపురం, గురవాయిగూడెం, వేపుగుంట, శ్రీరామవరం, తిరుమలదేవిపేట, వెంకటాపురం, బొర్రంపాలెం శివారు వరకూ కొనసాగనుంది. పలుచోట్ల రైతులు, దళితులు, పోలవరం నిర్వాసితులతో లోకేష్ సమావేశం కానున్నారు.

కలెక్టరేట్‌లో మహిళ ఆత్మహత్యాయత్నం

భూ సమస్య పరిష్కరించడం లేదంటూ ఆవేదన

ఆత్మహత్యకు యత్నించిన మహిళ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

పలుమార్లు అధికారుల చుట్టూ తిరిగినా తన భూ వివాదం పరిష్కారం కాకపోవడంతో ఓ మహిళ ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన ఘటన ఏలూరు కలెక్టరేట్‌లో సోమవారం జరిగింది. బాధితురాలిలు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండవల్లి మండలం దెయ్యంపాడు గ్రామానికి చెందిన సైదు బేబీ కుమారికి గ్రామంలో 56 సెంట్ల స్థలం ఉంది. దాన్ని అదే గ్రామానికి చెందిన ముంగర కనకం, ముంగర రామారావు, ముంగర కొండలు, ముంగర ఏసుపాదం కలిసి ఆక్రమించుకున్నారు. ఈ విషయంపై అనేకసార్లు అధికారులు చుట్టూ తిరిగినా న్యాయం జరగడం లేదని, స్థలం సర్వే చేయడానికి వచ్చిన గ్రామ రెవెన్యూ అధికారి ఆక్రమణదారులు ఇచ్చే లంచాలకు ఆశపడి తన స్థల వివాదం ఎటూతేల్చడం లేదని, దీంతో జనవరి నుంచి ఇప్పటివరకు నాలుగుసార్లు స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌కు సైతం ఫిర్యాదు చేశానని, అయినా న్యాయం జరగలేదని తెలిపింది. దీంతో మనస్తాపం చెందిన ఆమె స్పందన కార్యక్రమంలో మరోసారి ఫిర్యాదు చేసేందుకు కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఆమె తనతోపాటు తెచ్చుకున్న పురుగులమందు సేవించేందుకు ప్రయత్నించింది. ఈ తరుణంలో అక్కడే ఉన్న మహిళా కానిస్టేబుల్ వెంటనే స్పందించి బేబీకుమారి చేతిలోని పురుగుల మందు డబ్బాను లాక్కున్నారు. ఈ ఘటనలో ఆమె కళ్లు తిరిగి పడిపోయింది. దీంతో ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి బాగానే ఉందని వైద్యులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు తనకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో కలెక్టర్ కార్యాలయం ముందు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని బేబీకుమారి తెలిపింది.

స్పందించిన జెసి

దీనిపై స్పందించిన జెసి లావాణ్యవేణి మండవల్లి తహశీల్దార్‌తో నేరుగా ఫోన్‌లో మాట్లాడి ఈ విషయమై తగు చర్య తీసుకోవాలని ఆదేశించారు. దీనిపై తహశీల్దార్ మాట్లాడుతూ గతంలో బేబీకుమారి దాఖలు చేసిన స్పందన దరఖాస్తుపై గ్రామ సర్వేయర్, గ్రామ రెవెన్యూ అధికారితో తహశీల్దార్ కలిసి దస్తావేజుల నకళ్ల ఆధారంగా భూమిని పరిశీలించామని, ఆ భూమి దట్టమైన ముళ్ల కంపలు కలిగి ఉండి, ముంగర ఏసుపాదం, కనకలింగేశ్వరరావు, రామారావు, కొండలు అనేవారు కూడా ఈ భూమి హక్కు కోసం సివిల్ కోర్టులో ఏడు దావాలు పెండింగ్ లో ఉన్నాయని తహశీల్దార్ జెసికి తెలిపారు. దీంతో సివిల్ కోర్టు దావాల్లో తీర్పు వెలువడిన తర్వాత మాత్రమే ఈ సమస్య పరిష్కారమవుతుందని మహిళకు జెసి తెలిపారు.

ధర్నా చేస్తున్న నాయకులు, నాయక్ కులస్తులు

'నాయక్'లకు ఎస్‌టి కుల ధృవీకరణ పత్రాలివ్వాలి

కలెక్టరేట్ వద్ద కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కామవరపుకోటలో నివసిస్తున్న నాయక్ కులస్తులకు ఎస్‌టి కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని కోరుతూ వందలాది మంది ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద కెవిపిఎస్, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఆడపిల్లలు మోకాళ్లపై నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్, నాయకులు మంచెల్ల ఇస్సాకు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ మండల కేంద్రం కామవరపుకోటలో సుమారు 300 కుటుంబాలు నాయక్ కులస్తులు తరతరాలుగా ఇక్కడే జీవిస్తున్నారని తెలిపారు. వీరికి గత ప్రభుత్వ హయాం వరకూ ఎస్‌టిలుగా కుల ధృవీకరణ పత్రాలను ప్రభుత్వం ఇచ్చేదని గుర్తు చేశారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత నిబంధనలు పెట్టి గత ప్రభుత్వాలు ఎస్‌టిలుగా గుర్తించిన వారిని నేడు గుర్తించడానికి నిరాకరిస్తుందని విమర్శించారు. వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారని తెలిపారు. నాయక్ కులస్తులను ఎస్‌టిలుగా గతంలో మాదిరిగానే గుర్తించి వారి విద్యా, ఉపాధి అవకాశాలకు లబ్ధి చేకూరే విధంగా కుల ధృవీకరణ పత్రాలు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు రాజేష్, యశ్వంత్, కెవిపిఎస్ ఏలూరు సిటీ నాయకులు బాలరాజు, నాయక్ కుల పెద్దలు పాల్గొన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు వినతిపత్రం సమర్పించారు.

దేహదారుఢ్య పరీక్షలకు 600 మంది హాజరు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

మూడో రోజు సోమవారం నిర్వహించిన ఎస్ఐ అభ్యర్థుల దేహదారుఢ్య పరీక్షలకు 600 మంది హాజరయ్యారు. అత్యంత కట్టుదిట్టమైన బందోబస్తుతో, అభ్యర్థులకు అసౌకర్యం కలగకుండా పోలీసు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఏలూరు రేంజ్ డిఐజి జివిజి.అశోక్‌కుమార్ ఈ పరీక్షలను పర్యవేక్షిస్తున్నారు. అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా సీసీ కెమెరాల నిఘాలో పగడ్బందీగా పరీక్షలు నిర్వహిస్తున్నారు. నోటిఫికేషన్ ఆధారంగా అభ్యర్థులకు ప్రతిరోజూ ఫిజికల్ టెస్టులు చేపడుతున్నారు. జిల్లా అదనపు ఎస్‌పి ఎంజెవి.భాస్కరావు, డిఎస్‌పిలు నున్న మురళీకృష్ణ, విజయ్‌పాల్, కె.ప్రభాకర్‌రావు పోటీ పరీక్షలు సజావుగా సాగేలా విధులు నిర్వర్తిస్తున్నారు.

ట్రిపుల్ ఐటీలో 4400 సీట్లు భర్తీ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

ట్రిపుల్ ఐటి 2023-24 సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ముగిసింది. నూజివీడు, ఇడుపులపాయ, శ్రీకాకుళం, ఒంగోలు ట్రిపుల్ ఐటీలకు సంబంధించి మొత్తం 4400 సీట్లు భర్తీ అయ్యాయి. ఆఖరి విడతలో మిగిలిన 70 సీట్లు భర్తీ కావడంతో ప్రవేశాలప్రక్రియ ముగిసినట్లు కన్వీనర్ ఆచార్య గోపాలరాజు తెలిపారు. ఇప్పటికే తరగతులు ప్రారంభమయ్యాయని, సీట్లు పొందిన వారు వెంటనే తరగతులకు హాజరుకావాలని సూచించారు.

అర్జీదారులను సంతృప్తిపర్చే అధికారులకు సత్కారం

ప్రజాశక్తి - ఏలూరు

అర్జీదారుడు తృప్తిపొందేలా ఫిర్యాదులకు పరిష్కారం చూపే అధికారులను సత్కరిస్తామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తెలిపారు. స్థానిక కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వినతులను కలెక్టర్‌తోపాటు జాయింట్ కలెక్టర్ బి.లావణ్యవేణి, జిల్లా రెవెన్యూ అధికారి ఎవిఎన్ఎస్.మూర్తి, ఏలూరు ఆర్‌డిఒ కె.పెంచల కిషోర్, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జివివి.సత్యనారాయణ స్వీకరించారు. స్పందన కార్యక్రమంలో 264 అర్జీలు అందాయని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీర్ఘకాల సమస్యలకు కూడా పరిష్కారం చూపారనే మాట రావాలన్నారు. అలాంటి అనుకూల వార్తలకు సంబంధించి గత 60 రోజుల్లో పరిష్కరింపబడిన విజయగాథలను వెలుగులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతీశాఖ నుంచి వ్యక్తిగత, కమ్యూనిటీ గ్రీవెన్సెస్ అర్జీదారులు సంతృప్తి చెందామని తెలిపే వాటి వివరాలను అందజేయాలన్నారు. ప్రతీవారం నిర్వహించే జగనన్నకు చెబుదాం - స్పందన కార్యక్రమానికి ముందు కనీసం ఏడుగురు అర్జీదారులకు ఆయా సమస్యల పరిష్కారానికి సంబంధించిన అంశాలను కాగిత రూపంలో అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సివిల్ అంశాలకు సంబంధించి న్యాయస్థానం స్టే ఉత్తర్వులు ఉంటే తప్పా మిగిలిన వాటిని పరిష్కరించడంలో తహశీల్దార్, ఎస్‌హెచ్ఒలతో కూడిన మండల కమిటీ చొరవ చూపాలన్నారు.

విద్యుత్ ఉద్యమం జగన్‌కు కనువిప్పు కావాలి

ఛార్జీలు, భారాలు తగ్గించకుంటే టిడిపికి పట్టిన గతి తప్పదు - విద్యుత్ అమరుల సంస్మరణ సభల్లో నేతలు



ఏలూరులో నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు

2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటాన్ని నేటి వైసిపి ప్రభుత్వం గుర్తు చేసుకోవాలని, ఆనాడు తెలుగుదేశం ప్రభుత్వానికి పట్టిన గతి నేడు జగన్ ప్రభుత్వానికి పట్టకూడదంటే పెంచిన విద్యుత్ ఛార్జీలను తగ్గించాలని, ప్రజలపై వేస్తున్న భారాలను ఉపసంహరించుకోవాలని సిపిఎం జిల్లాకార్యదర్శి ఎ.రవి హెచ్చరించారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో సోమవారం విద్యుత్ అమర వీరుల వర్ధంతి సభ ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పి.కిషోర్ అధ్యక్షతన జరిగింది. తొలుత విద్యుత్ అమరవీరుల చిత్రపటానికి ఎ.రవి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ ప్రపంచ బ్యాంక్ ఆదేశాల మేరకు చంద్రబాబు విద్యుత్ ఛార్జీలు పెంచడం, ఆ ఛార్జీలకు వ్యతిరేకంగా వామపక్షపార్టీలు, ఆనాటి కాంగ్రెస్, ఇతర ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున విద్యుత్ పోరాటం సాగిందని గుర్తుచేశారు. 2000 సంవత్సరం ఆగష్టు 28న అప్పటి సిఎం చంద్రబాబు కిరాతకంగా విద్యుత్ పోరాటం చేస్తున్నవారిపై పోలీసులతో కాల్పులు జరిపి బాలస్వామి, రామకృష్ణ, విష్ణువర్ధన్ రెడ్డిని బలిగొన్నాడన్నారు. అనేక మంది లాఠీ దెబ్బలు తిన్నారని తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా నుండి విద్యుత్ పోరాటంలో పాల్గొనేందుకు హైదరాబాద్ వెళ్లిన కార్యకర్తలు కూడా తీవ్రంగా గాయపడ్డారని గుర్తు చేశారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జరిగిన విద్యుత్ పోరాటం ఫలితంగానే చంద్రబాబు, ఆ తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, విభజన తర్వాత రాష్ట్రానికి ముఖ్యమంత్రులు అయిన వారు ఎవ్వరూ విద్యుత్ ఛార్జీలు పెంచే యోచనే చేయలేదన్నారు. చరిత్రక విద్యుత్ పోరాటంలో భాగస్వామిగా ఉన్న ఆనాటి కాంగ్రెస్ నాయకులు రాజశేఖర్‌రెడ్డి కుమారుడు ప్రస్తుత సిఎం జగన్ నేడు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం తీసుకువచ్చిన 2020 విద్యుత్ సవరణల చట్టం ద్వారా ట్రూఅఫ్, సర్దుబాటు, సర్ ఛార్జీలు, కస్టమర్ ఛార్జీలు, ఫిక్సడ్ ఛార్జీలు, ఎస్టాబ్లిష్‌మెంట్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ పేర్లతో విద్యుత్ ఛార్జీలు విపరీతంగా పెంచి ప్రజల నడ్డి విరుస్తోందని విమర్శించారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్లు పెట్టి ఆ భారాన్ని కూడా ప్రజల నుండే వసూలు చేస్తామని చెప్పడం దారుణమన్నారు. రైతుల వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తున్నారని, మరోవైపు ఆర్‌టిసి ఛార్జీలు, పట్టణాల్లో ఆస్తి పన్ను, ఇంటి పన్ను, నీటి పన్ను, ఎక్కడా లేని విధంగా చెత్తపై పన్ను వేసి ప్రజలను మరింత ఆర్థిక ఇబ్బందులకు గురిచేస్తున్నారని విమర్శించారు. ప్రజలందరూ ఈ భారాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేయడం ద్వారానే మోడీ షరతులు, జగన్ అమలుతీరు ఆగుతుందని లేకపోతే ప్రజలపై మరింతగా విద్యుత్ భారాలతోపాటు ఇతర భారాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మోపుతాయని తెలిపారు. ఈ భారాలకు వ్యతిరేకంగా సిపిఎం ఆధ్వర్యంలో ఈ నెల 30 నుండి వచ్చేనెల నాలుగో తేదీ వరకూ నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమాల్లో ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు గుడిపాటి నరసింహారావు, కె.శ్రీనివాస్, ఇతర నాయకులు వి.సాయిబాబు, బి.జగన్నాధరావు, శారద, త్రినాధ్, ఇస్సాక్, ఎం.సత్యం, మావూరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించుకోకుంటే మరో విద్యుత్ ఉద్యమం తప్పదని వామపక్షాలు హెచ్చరించాయి. సోమవారం ఏలూరు ఫైర్‌స్టేషన్ సెంటర్‌లో బషీర్‌బాగ్ విద్యుత్ ఉద్యమంలో మృతి చెందిన ముగ్గురు అమరులకు వామపక్ష పార్టీలు నివాళులర్పించాయి. స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద సిపిఐ ఏలూరు సమితి కార్యదర్శి ఉప్పులూరి హేమశంకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా అధికార ప్రతినిధి యు.వెంకటేశ్వరరావు, సిపిఎం ఏలూరు కార్యదర్శి పి.కిషోర్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, బండి వెంకటేశ్వరరావు, కొంపల్లి కృష్ణమాచార్యులు, సిపిఎం నాయకులు బి.సోమయ్య, వి.సాయిబాబు, జగన్నాధరావు, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ నాయకుల బద్దా వెంకట్రావు, గడసాల రాంబాబు పాల్గొన్నారు.

నిడమర్రు: విద్యుత్ పోరాట అమరులకు సిపిఎం నేతలు నివాళులర్పించారు. ఈ సందర్భంగా భువనపల్లి రావిచెట్టు సెంటర్‌లో విద్యుత్ పోరాట అమరుల సంతాప సభ కోన శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు, నాయకులు గవర సత్యనారాయణ. వెలగలేటి మోహన్, పి.సూరిబాబు, వెంకటేష్, నరేష్, రంగారావు, మనీష పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : విద్యుత్ ఛార్జీలు తగ్గించకపోతే జగన్ ప్రభుత్వానికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని వాపక్ష పార్టీల నాయకులు హెచ్చరించారు. సోమవారం విద్యుత్ అమరవీరుల సంస్మరణ సభ ధర్మన్న స్మారక భవనంలో సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో జరిగింది. చల్లారి మాణిక్యాలరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఐఎం ఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కమిటీ సభ్యులు రమణ, సిపిఐ మండల కార్యదర్శి జెవి.రమణరాజు, సిపిఎం పట్టణ కన్వీనర్ పసల సూర్యారావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వి.సత్యనారాయణ, సిపిఐ నాయకులు బి.బాలరాజు, కుంచె వసంతరావు, జి.బాలఏసు, తమ్మా సోమలింగ మల్లికార్జునరావు, కె రామలక్ష్మి పాల్గొన్నారు.

30న ఐటిడిఎ పాలక వర్గ సమావేశం

ప్రజాశక్తి - ఏలూరు/బుట్టాయగూడెం

ఐటిడిఎ, పాలక వర్గ సమావేశం ఈనెల 30వ తేదీ బుధవారం ఉదయం 10.30 గంటలకు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, కెఆర్‌పురం సమావేశ మందిరంలో పాలకవర్గ సమావేశం నిర్వహించబడుతుందని ఐటిడిఎ పిఒ యం.సూర్యతేజ తెలియజేశారు. జిల్లా కలెక్టర్, ఛైర్మన్, సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ, కెఆర్ పురం వారి అధ్యక్షతన నిర్వహించబడుతున్నది. కావున జిల్లా, డివిజన్ అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పక హాజరు కావాల్సిందిగా ఆయన కోరారు.

భోజనశాల నిర్మాణానికి వితరణ

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని గొల్లపల్లి అన్నే రామకృష్ణయ్య జడ్‌పి ఉన్నత పాఠశాలలో శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ ఆచార్యులు సంస్కృతాంధ్ర పండితుడు రఘునాథ శర్మ పాఠశాలలో భోజనశాల నిర్మాణ నిమిత్తం రూ.లక్ష, పూర్వ విద్యార్థులు రూ.1.5 లక్షలు విరాళంగా అందజేశారు. అనంతరం సరస్వతి దేవి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులతో పాటు పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'స్కూల్ కాంప్లెక్స్' సమావేశం 30కి వాయిదా

నూజివీడు రూరల్ : నూజివీడు నియోజకవర్గ పరిధిలోని వ్యాయామ ఉపాధ్యాయులకు సోమవారం నిర్వహించాల్సిన 'స్కూల్ కాంప్లెక్స్' సమావేశాన్ని వాయిదా వేసినట్లు నియోజకవర్గ ఇంఛార్జ్ పి.రవీంద్ర పేర్కొన్నారు. ఈనెల 30వ తేదీన సమావేశం ఉంటుందని ఆయన తెలిపారు.

రోడ్డు మరమ్మతు చేయాలి

జీలుగుమిల్లి : ఏజెన్సీ ప్రాంతంలో గోతులమయమైన రోడ్లను తక్షణమే మరమ్మతులు చేపట్టాలని ప్రగతిశీల యోజన సంఘం అధ్వర్యంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం కామయ్య పాలెంలో ప్రగతిశీల యువజన సంఘం డివిజన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన అధ్యక్ష, కార్యదర్శులు పోతిరెడ్డి, గురుకుల ప్రసాద్‌లు మాట్లాడుతూ ఏజెన్సీలో రోడ్ల పరిస్థితి దుర్భరంగా ఉందన్నారు. ప్రధాన రహదారులు, ఆదివాసీ గ్రామాలకు వెళ్లే రోడ్లు, బ్రిడ్జిలు పూర్తిగా శిథిలమైపోయి ప్రయాణాలకు ప్రమాదకరంగా మారాయన్నారు. అదే విధంగా మారుమూల గిరిజన గ్రామం అంకన్నగూడెం నుంచి జీలుగుమిల్లి వెళ్లే రోడ్డు గోతులమయంగా వున్నాయని, వెంటనే ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

కొత్త సిఆర్‌ఒ కార్యాలయం ప్రారంభం

ద్వారకాతిరుమల : చిన్న వెంకన్న దేవస్థానం ద్వారా తిరుమలకు చెందిన సెంట్రల్ రిజర్వేషన్(సిఆర్‌ఒ) కార్యాలయాన్ని తూర్పు వైపు జంట గాలి గోపురాల వద్ద నుంచి కొండపైన వాహన పూజల వద్దకు మార్పు చేసి ఉన్నారు. భక్తులు ఈ విషయాన్ని గమనించాలని ఆలయ అధికారులు తెలిపారు. ఆలయ ఛైర్మన్ ఎస్.వి.సుధాకర్‌రావు సోమవారం ఉదయం సిఆర్‌ఒ ఆఫీసును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ఆశీల వసూలు అరికట్టాలి

జంగారెడ్డిగూడెం : పట్టణంలో అధికంగా వసూలు చేస్తున్న అధిక ఆశీల వసూలు అరికట్టాలని పలువురు చిరు వ్యాపారాలు వాపోతున్నారు. సోమవారం రాజమండ్రి నుంచి జంగారెడ్డిగూడెం ఫ్రూట్ షాప్‌లో లోడ్ వేసుకొచ్చిన డ్రైవర్ దగ్గర రూ.200 ఆశీలు వసూలు చేశారని డ్రైవర్ రాము ఆవేదన వ్యక్తం చేశారు. ఆశీల వసూలు ప్రభుత్వ నిబంధనల మేరకు వసూలు చేసే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ట్రక్కు డ్రైవర్లు కోరుతున్నారు.

వాహనాల తనిఖీపై అవగాహన

నూజివీడు రూరల్ : పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో వాహన చోదకులకు అవగాహన, వాహనాల తనిఖీల కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలని డిఎస్‌పి అశోక్ కుమార్ గౌడ్ ఆదేశించారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో సిఐలు, ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతమైన వాతావరణాన్ని స్పెషల్ పార్టీలో విస్తృత తనిఖీలు నిర్వహించాలి, నేర ప్రవృత్తి గల వారిని అదుపులోకి తీసుకోవాలన్నారు.

గుంతలో దిగబడ్డ ఆయిల్ ట్యాంకర్

ముదినేపల్లి : భారీ గుంతలో ఆయిల్ ట్యాంకర్ లారీ ఇరుక్కుపోవడంతో ట్రాఫిక్ స్తంభించిన సంఘటన సోమవారం సాయంత్రం మండలంలోని వడాలి సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం విజయవాడ నుంచి భీమవరం వెళ్తున్న ఆయిల్ ట్యాంకర్ లారీ ముదినేపల్లి - బంటుమిల్లి రోడ్డులో వడాలి సెంటర్‌లో భారీగా ఏర్పడిన గుంతలో దిగబడిపోయింది. లారీ గుంతలో ఇరుక్కుపోవడంతో గుడివాడ, విజయవాడ, బంటుమిల్లి, భీమవరం వైపు వెళ్లే వాహనాలకు తీవ్ర ఆటంకం ఏర్పడి, ట్రాఫిక్ స్తంభించింది. ఎట్టకేలకు ట్యాంకర్ డ్రైవర్ సమయస్ఫూర్తితో అతికష్టం మీద ఆయిల్ ట్యాంకర్ లారీని గుంతలో నుంచి బయటకు తీశాడు. దీంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు. తిరిగి వాహనాల రాకపోకలు మొదలైయ్యాయి.

జీర్ణించుకోలేకపోతున్న వైసిపి నేతలు : టిడిపి

ప్రజాశక్తి - ముసునూరు

లోకేష్ యువగళం పాదయాత్ర విజయవంతం కావడంతో, వైసిపి నాయకులు దాన్ని జీర్ణించుకోలేక జనాన్ని కూలీ ఇచ్చి తీసుకువచ్చారని మాట్లాడం అవివేకమని రాష్ట్ర తెలుగుయువత ఆర్గనైజింగ్ సెక్రటరీ గద్దే రఘుబాబు, మండల ఎస్‌సి సెల్ అధ్యక్షులు బి.అజయ్‌కుమార్‌లు తెలిపారు. సోమవారం మండలంలోని ముసునూరు టిడిపి కార్యాలయంలో పలువురు నాయకులు, సర్పంచులు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకురాలు యం.శ్రీలక్ష్మి మాట్లాడుతూ టిడిపిలో లబ్ధి పొంది, వైసిపిలో పదవి వచ్చాక టిడిపిని తిట్టడం సరికాదన్నారు. బడుగు షారోన్‌రోజా, కందుల పిచ్చియ్య మాట్లాడుతూ డ్వాక్రా సంఘాలు పెట్టి అభివృద్ధి చేసింది టిడిపి అన్నారు. తెలుగుయువత కార్యదర్శి కె.బాబి, కూచిపూడి దేవేంద్ర మాట్లాడుతూ నూజివీడు ఎంఎల్‌ఎ మేకా ప్రతాప్ అప్పారావు, ప్రతి సారీ మాట్లాడే విధానంలో ముద్దరబోయిన వెంకటేశ్వరరావుపై సవాల్ విసురుతూ గొడవలకు దిగేవిధంగా వ్యవహారించడం సభ్యత కాదని, ఎంఎల్‌ఎ స్థాయిలో వుండి సంస్కారంగా మాట్లాడాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్‌పిటిసి చిలుకూరి వెంకటేశ్వరరావు, కూచిపూడి దేవేంద్ర, బాబి, గారపాటి నరిసింహారరావు, సత్యనారాయణ, మేదరమెట్ల సురేంద్ర పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనులకు ఎంఎల్‌ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి- ముదినేపల్లి

జిల్లాలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన మండలంలోని సింగరాయపాలెం సెంటర్‌లో ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో నూతనంగా నిర్మించనున్న సివిల్ డ్రెయినేజీ పనులకు సోమవారం ఎంఎల్‌ఎ దూలం నాగేశ్వరరావు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఆర్.సత్యనారాయణ, గంటా సంధ్య, ఆలయ ఛైర్మన్ శొంఠి నాగరాజు, ఎం.ఏసుబాబు పాల్గొన్నారు.

ఎంపిపి తనయుడికి ఎంఎల్‌ఎ పరామర్శ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని గూటాల గ్రామంలో ఏలూరు జిల్లా ఎంపిపి సంఘం అధ్యక్షులు, పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి తనయుడు సుంకర కొండబాబు ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకుని పరామర్శించడానికి పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు విచ్చేశారు. వీరితో ఎంపిటిసి దెగపాటి హరిరామకృష్ణ, గూటాల వైసిపి నాయకులు గంధం రాజు, మాదేపల్లి హరిబాబు, ఆకుల బుజ్జి, ఎస్ఐ ఎస్-ఎస్ఎస్ పవన్ కుమార్ ఉన్నారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న బైకును ఢీకొన్న వాహనం

వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణంలో సోమవారం రోడ్డు పక్కన ఆగి ఉన్న బైకును వేగంగా వచ్చిన టాటా మ్యాజిక్ ఢీ కొనడంతో బైకుపై ఉన్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ట్రిపుల్ ఐటీలో కార్మికురాలుగా విధులు నిర్వహిస్తున్న బండి మాణిక్యంను తీసుకువెళ్లేందుకు ఆమె భర్త శివాజీ(44) వేచి ఉండగా, ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన శివాజీని నూజివీడు ఏరియా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, వైద్య సేవలు అందిస్తున్నారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ.. సిపిఎం సమరభేరి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నిరుద్యోగం, అధిక ధరలు అరికట్టాలని సిపిఎం చేపట్టిన సమరభేరి 'వాల్‌పోస్టర్‌ను' సిపిఎం కార్యాలయంలో నగర కార్యదర్శి పి.కిషోర్, నాయకులు సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై సిపిఎం అఖిల భారత కమిటీ ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ దేశవ్యాప్త ఆందోళనలకు పిలుపునిచ్చిందన్నారు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పెట్రోలు, డీజిల్, గ్యాస్, కరెంటు చార్జీలు నిత్యం పెంచుతూనే ఉందన్నారు. బిజెపి అధికారంలోకి రాకముందు పెట్రోల్, డీజిల్ రూ.40, 50 ఉండేవి, ఇప్పుడు రూ.110 పెరిగిందన్నారు. కరెంటు రూ.300, 400 బిల్లు వచ్చేది, నేడు రూ.వెయ్యా, రెండు వేలు వస్తుందన్నారు. గ్యాస్ బండ ధర రూ.450 ఉండేది నేడు రూ.1,200 పెరిగిందన్నారు. ఈ రకంగా ప్రజలపై అధిక ధరలు మోపి బిజెపి అధాని, అంబానీ వంటి కార్పోరేట్ సంస్థలకు రూ.లక్షల కోట్లు రాయితీలు ఇస్తుందని విమర్శించారు. మోడీ అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చారని, కనీసం

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రెండు లక్షలు ఉద్యోగాలు కూడా ఇప్పటికీ ఇవ్వలేదన్నారు. పైగా ప్రభుత్వ రంగ సంస్థలు ప్రెయివేటీకరణ చేస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు అధిక ధరలు, నిరుద్యోగం, అసమానతలపై ప్రశ్నిస్తుంటే దీన్ని దారిమళ్లించడానికి దేశంలో కుల, మత ఘర్షణలు రేపుతున్నారని తెలిపారు. మత విద్వేషాలు రెచ్చగొట్టి మణిపూర్, హర్యానా, కర్ణాటక, కాశ్మీర్ వంటి రాష్ట్రాల్లో మతకలహాలు సృష్టించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు బిజెపి ప్రత్యేక హోదా ఇవ్వకుండా మోసం చేసిందన్నారు. 'ఆంధ్రుల హక్కు విశాఖ ఉక్కు' అని పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రెయివేటు వారికి అమ్మేస్తుందన్నారు. ఇంతచేస్తున్న బిజెపికి రాష్ట్రంలోని ప్రధాన పార్టీలైన వైసిపి, టిడిపి వీటితో పాటు జనసేన వత్తాసు పలుకడం సిగ్గుచేటన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ప్రజలంతా ఈ కుటిల రాజకీయాలకు వ్యతిరేకంగా తిరగబడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు, మాఊరి శ్రీనివాస్, ఎం.ఇస్సాక్, మీసాల సత్యనారాయణ, ఎస్.సత్యనారాయణ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలు నిరసిస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 28 నుంచి సెప్టెంబర్ 4వ తేదీ వరకూ నిరసన కార్యక్రమాలు చేపడుతున్నామని సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ తెలిపారు. నిరుద్యోగం, విద్యుత్ చార్జీలు, అధిక ధరలకు వ్యతిరేకంగా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. బుట్టాయగూడెం సిపిఎం కార్యాలయంలో సోమవారం కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు సంబంధించి వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యురాలు తామ ముత్యాలమ్మ, సిపిఎం మండల కార్యదర్శి తెల్లం రామకృష్ణ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్నికల ముందు తాము అధికారంలోకొస్తే ధరలు తగ్గిస్తాం, సామాన్య ప్రజానీకానికి ధరలు అందుబాటులోకి తీసుకొస్తామన్నారని తెలిపారు. ప్రతి ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రజల మీద విపరీతమైన భారాలను మోపిందన్నారు. బిజెపి హయంలో నిత్యావసరాల ధరలు అధికంగా పెరిగాయని విమర్శించారు. బిజెపి విధానాలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఎం ఆధ్వర్యంలో సమరభేరి చేస్తున్నట్టు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు కోయిల శ్రీను పాల్గొన్నారు.

గిడుగు రామ్మూర్తి చిరస్మరణీయులు

ఘనంగా 160వ జయంతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

భీమడోలు శాఖా గ్రంథాలయంలో గిడుగు వెంకట రామమూర్తి జయంతి

వ్యవహారిక భాషాభివృద్ధికి విశేష కృషి చేసిన మహనీయులు గిడుగు రామ్మూర్తి చిరస్మరణీయులని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టికె.విశ్వేశ్వరరావు తెలిపారు. నారాయణపురం శ్రీఅరవింద శతజయంతి ప్రభుత్వం డిగ్రీ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో గిడుగు వెంకట రామమూర్తి 160వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాలలో భాగంగా అంతర్జాల సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సదస్సుకు అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్, ముఖ్య వక్తగా విచ్చేసిన ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్యులు డాక్టర్ బూసి వెంకటస్వామి మాట్లాడుతూ భావవ్యక్తీకరణకు భాషే ఆధారం, ఆ భాష పరాయి భాషా ప్రభావానికి గురై ఉనికిని కోల్పోయే స్థితి నుంచి స్వాతంత్రంగా మారడానికి కారణం వ్యవహారిక భాషా ఉద్యమం, దానికి సారథ్యం వహించిన గిడుగు రామమూర్తి, పిడుగులా ఉద్యమాన్ని నడిపిన భాషా సంస్కర్త వెంకట రామమూర్తి అని తెలియజేశారు. తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వై.విజయానంద రాజు మాట్లాడుతూ తెలుగు భాషా దినోత్సవం జరుపుకోవడానికి గల నేపథ్యం, కారణాలు వివరిస్తూ మనం ఉపయోగించే భాషా పదాలు వాటి పుట్టుకలను చక్కగా వివరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ తరపట్ల

హాజరైన నారాయణపురం డిగ్రీ కళాశాల విద్యార్థులు

సత్యనారాయణ మాట్లాడుతూ వేడుకల సందర్భంగా మాత్రమే తెలుగు భాష మాధుర్యం, గొప్పతనం గురించి చర్చలు చేస్తే సరిపోదు, మిగిలిన రోజుల్లో కూడా అదే వరవడిని కొనసాగించాలన్నారు. తెలుగులో చదువుకున్న విద్యార్థులకు ప్రత్యేక ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పటిష్టమైన ప్రణాళిక ఏర్పాటు చేసుకొని పోరాటం కొనసాగించకపోతే, మన విద్యార్థులు తెలుగు చదువుకునే అవకాశం ఉండదని, అదే జరిగితే మన ఉనికిని కోల్పోతామని తెలిపారు. ఆదికవి నన్నయ్య తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ వరప్రసాద్, సదస్సు సంచాలకులు డా.కొండా రవి మాట్లాడుతూ ఈ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖనం మొదలైన పోటీలు నిర్వహించి, ప్రోత్సహించామన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన అధ్యాపకులు, ఆచార్యులు, విద్యార్థులు 160 మందికి పైగా పాల్గొన్నారు.

భీమడోలు : తెలుగు వాడుక భాష ఉద్యమ పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి తెలుగు భాష అభ్యున్నతికి చేసిన కృషి నేటి తరాలకు సైతం ఆదర్శప్రాయమని భీమడోలు శాఖా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్ టివి ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో గ్రంథ పాలకులు కె.శ్రీనివాస రావు ఆధ్వర్యంలో సోమవారం గిడుగు వెంకట రామ్మూర్తి జయంతి సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు వ్యాసరచన, పద్యాలాపన పోటీలను నిర్వహించారు. తొలుత గిడుగు వెంకట రామ్మూర్తి చిత్రపటానికి గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఛైర్మన్‌తో పాటు గ్రంథ పాలకులు, పోటీల నిర్వహణ బాధ్యత చేపట్టిన ఉపాధ్యాయులు పి.లక్ష్మీనారాయణ పూలమాలలు వేసి సత్కరించారు. గిడుగు రామ్మూర్తి సేవలను కొనియాడారు. పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి ప్రోత్సాహక బహుమతి ప్రధాన కార్యక్రమాన్ని మంగళవారం చేయనున్నట్లు గ్రంథ పాలకులు తెలిపారు.

ఉపాధ్యాయినికి జాతీయస్థాయి పురస్కారం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

పట్టణానికి చెందిన మొలగలేటి ఉమా సావిత్రిభాయి పూలే ఉమెన్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయి పురస్కారానికి ఎంపికయ్యారు. కర్ణాటక రాష్ట్రంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో అక్కడి విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప ఆధ్వర్యంలో ఆమె ఈ పురస్కారం అందుకున్నారు. ఉమా నూజివీడు బాలిక ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినిలు అభినందనలు తెలిపారు.

నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్‌ఎ

నూతన సచివాలయం ప్రారంభం

ప్రజాశక్తి - పోలవరం

పాత పట్టిసీమలో సోమవారం నూతనంగా నిర్మించిన సచివాలయాన్ని పోలవరం ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజు ప్రారంభించారు. అనంతరం 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో పాల్గొని ప్రజలు సమస్యలు తెలుసుకున్నారు. వాటిని తొందరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ఎంపిపి సుంకర వెంకట రెడ్డి, ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ బి.సుమతి, జడ్‌పిటిసి కలుమ్ హేమ కుమారి, పట్టిసీమ సర్పంచి సబ్బవరపు శ్రీరామమూర్తి, వైసిపి మండల కన్వీనర్ బుగ్గ మురళీకృష్ణ, సొసైటీ ప్రెసిడెంట్ పాదం రాజబాబు, గూటాల సొసైటీ ప్రెసిడెంట్ సుంకర అంజిబాబు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ పేరిట రూ.100 నాణెం గర్వకారణం : టిడిపి

ప్రజాశక్తి - ఉంగుటూరు

తెలుగువారి సత్తాను ప్రపంచవ్యాప్తంగా చాటిన దివంగత ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు పేరున కేంద్రం 100 రూపాయల నాణేన్ని ముద్రించటం గర్వకారణమని ఆర్యవైశ్య సంఘం నాయకులు కోనా శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం రాత్రి కైకరంలో ఎన్‌టిఆర్ విగ్రహానికి పూలదండ వేసి స్వీట్‌లు పంపిణీ చేశారు. బాణాసంచా కాల్చి తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఇన్నాళ్లకు రామారావుకు గుర్తింపు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు.

జగన్‌తోనే రాష్ట్రాభివృద్ధి : మేయర్

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

మాట్లాడుతున్న మేయర్ నూర్జహాన్

సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రిగా వస్తేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు తెలిపారు. మాజీ డిప్యూటీ సిఎం ఏలూరు ఎంఎల్‌ఎ ఆళ్ల నాని ఆదేశాల మేరకు సోమవారం స్థానిక గోకుల్ కళ్యాణ మండపంలో ఏలూరు నియోజకవర్గంలోని 50 డివిజన్ల కార్పొరేటర్లు, సచివాలయ కన్వీనర్లతో ముఖ్య సమావేశం ఏర్పాటు చేశారు. 2014లో జరిగిన రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్ ఎంతో కష్టాల్లో కూరుకు పోయిందన్నారు. టిడిపి హయాంలో రాష్ట్రం అభివృద్ధి చెందకపోగా, మరింత దిగజారి పోయిందని విమర్శించారు. జగన్ ప్రభుత్వంలో విద్య, ఆరోగ్యం, సంక్షేమంపై అవసరమైన వ్యయం చేశారన్నారు. గ్రామ, వార్డు, సచివాలయ వ్యవస్థ ద్వారా సమాజంలో చివరి వ్యక్తి వరకు సేవలు, సంక్షేమ ఫలాలు అందిస్తున్నారన్నారు. అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన, సున్నా వడ్డీ, చేయూత మొదలగు సంక్షేమ పథకాల నగదు మొత్తాన్ని మహిళల ఖాతాల్లో జమ చేస్తూ 75 శాతం మహిళా సాధికారతను ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాటించారన్నారు. ఇచ్చిన హామీలు 98 శాతం నెరవేర్చిన ఘనత ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి దక్కిందన్నారు. అందుకే మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్మోహన్ రెడ్డి రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని ప్రజలకు తెలియజేస్తున్నామన్నారు. ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న అవాస్తవాలను తిప్పికొడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సేవలను, జరుగుతున్న అభివృద్ధిని ప్రజలకు వివరిస్తూ, పార్టీపై తప్పుడు ప్రచారం చేసే వారిని ప్రజలే నిలదీసే విధంగా ప్రజలను చైతన్యవంతులు చేయాలని కార్పొరేటర్లు, కో-ఆప్షన్ సభ్యులు, సచివాలయ కన్వీనర్లకు మేయర్ నూర్జహాన్ పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి వైసిపి పట్టణ అధ్యక్షులు బొద్దాని శ్రీనివాసరావు అధ్యక్షత వహించగా వైసిపి నాయకులు ఎస్ఎంఆర్ పెదబాబు, ఎంఆర్ డి.బలరాం, డిప్యూటీ మేయర్లు గుడిదేశీ శ్రీనివాసరావు, నూక పేయి సుధీర్ బాబు, రాష్ట్ర సాహిత్య అకాడమీ ఛైర్మన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఎఎంసి మాజీ ఛైర్మన్ మంచె మహిబాబు, సచివాలయంలో జోన్ కన్వీనర్లు మొటమర్రి సదానందం, కార్పొరేటర్లు యాగ్రంశెట్టి సుమన్, తుమరాడ స్రవంతి, ఎఎంసి వైస్ ఛైర్మన్ కంచన రామకృష్ణ తదితరులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో 50 డివిజన్ల కార్పొరేటర్లు, ఇంఛార్జీలు, 79 సచివాలయాల కన్వీనర్లు హాజరయ్యారు.

సెప్టెంబర్ 29లోగా ఇ-క్రాప్ చేయించాలి

భీమడోలు : వ్యవసాయశాఖ భీమడోలు సహాయ సంచాలకులు కార్యాలయ పరిధిలోని నాలుగు మండలాలకు చెందిన రైతులు సెప్టెంబర్ 29వ తేదీలోగా ఇ-క్రాప్‌లో నమోదు చేయించుకోవాలని, ప్రభుత్వం అందజేస్తున్న సహాయ, సహకారాలు సద్వినియోగపరుచుకోవాలని భీమడోలు సహాయ సంచాలకులు డాక్టర్ పి.ఉషా రాజకుమారి కోరారు. భీమడోలులోని తన కార్యాలయంలో సోమవారం సహాయ సంచాలకులు మాట్లాడుతూ తన కార్యాలయ పరిధిలోని భీమడోలులో 15,845, ద్వారకాతిరుమలలో 41,424, ఉంగుటూరులో 38,057, నిడమర్రులో 35,023 ఎకరాలతో కలిపి సుమారు లక్ష ఎకరాల విస్తీర్ణంలో వివిధ పంటల సాగు జరుగుతుందన్నారు. ఇంతవరకూ 20 శాతం మంది రైతులు మాత్రమే ఇ-క్రాప్‌లో నమోదయ్యారని తెలిపారు. గతం కన్నా భిన్నంగా ఇ-క్రాప్ నమోదు కార్యక్రమాన్ని రైతు భరోసా కేంద్రాల వారీగా చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా సర్వే నెంబర్ల వారీగా సాగవుతున్న పొలము, రైతు ఫోటోతో పాటు పంట రకము, వెరైటీ, ఇతర వివరాలను నమోదు చేసుకుని, సదరు పత్రంపై తన సమక్షంలో నమోదు చేసినట్లు రైతు సంతకం చేసిన అంగీకార పత్రాన్ని సమర్పించాల్సి ఉంటుందన్నారు. ద్వారకాతిరుమల మండలంలో 10 శాతం తక్కువ వర్షపాతం నమోదైందన్నారు. మండలానికి మూడుకు తక్కువ కాకుండా వీటిని కేటాయించే అవకాశం ఉందన్నారు. ఆసక్తికర లబ్ధిదారులు పాస్ పోర్ట్‌తో పాటు, కనీస విద్యార్హతలతో పాస్ పోర్టును కలిగి ఉంటే, వారికి డ్రోన్ల నిర్వహణపై తగు శిక్షణ ఇచ్చి రాయితీపై వాటిని అందజేస్తామన్నారు.

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 79/2022
ఇన్
ఓ.యస్.నెం. 42/2017

బిట్వీన్:
కోటబోయిన కాసులు ...డి. హెచ్. ఆర్
మరియు
ఈపి మురళి ...జె.డి.ఆర్

పై నెంబరు గ్రంధములో డి.హెచ్.ఆర్. గారు శ్రీ కోర్టు వారి ద్వారా మిమ్ములను కోర్టు వారి ఎదుట హాజరు కావాలని పలుమార్లు కోర్టు వారి ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు కోర్టు నోటీసులు తీసుకొనకుండా ఉద్దేశ్యపూర్వకముగా కాలయాపన చేయుచున్నారు అనిన్నీ, కావున శ్రీ కోర్టు వారు మీ హాజరు నిమిత్తం **ది.04-09-2023వ తేదీ నాటికి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, మీ వకీలు గారి ద్వారా కాని హాజరు అయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకోవలయును.** లేని ఎడల పై పిటీషను మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
గొల్లపూడి వెంకట ద్వారకానాథ్
న్యాయవాది, తాడేపల్లిగూడెం.
సెల్: 93464 84736

లైన్‌మేన్‌పై చర్యలు తీసుకోవాలి

జంగారెడ్డిగూడెం : గత 12 సంవత్సరాలుగా వ్యవసాయ సాగు భూమిలో వినియోగిస్తున్న వ్యవసాయ విద్యుత్ సర్వీస్‌ను తొలగించిన కేతవరం గ్రామ లైన్‌మేన్ నాగరాజుపై చర్యలు తీసుకోవాలని మండలంలోని కేతవరం గ్రామస్తులు వామిశెట్టి నరసురావు అధికారులను కోరారు. సోమవారం స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఆర్‌డిఒ ఝాన్సీరాణికి వినతిని అందించారు. ఈ సందర్భంగా వామిశెట్టి నరసురావు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా మా తాతగారి నుంచి సంక్రమించిన భూమిలో వారసత్వంగా మా అమ్మగారైన వామిశెట్టి మణమ్మ పేరున 1378 మోటార్ సర్వీస్ నెంబర్‌తో గత 12 సంవత్సరాలుగా వ్యవసాయ బోరు వినియోగించుకుంటున్నట్లు తెలిపారు. ఇటీవల గ్రామ లైన్‌మేన్ జలపాల నాగరాజు ఎటువంటి సమాచారం లేకుండా వరి, కొబ్బరి మొక్కలతో సాగులో ఉన్న మా పంటకు నీటి సదుపాయం లేకుండా కరెంటును అక్రమంగా తొలగించినారని ఫిర్యాదులో పేర్కొన్నారు. లైన్‌మేన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు.

తణుకు పురపాలక సంఘం

ఆర్.ఓ.సి.నెం. ODW/01/95/2023/ఇ1 **తేది.28-08-2023**

టెండరు నోటీసు

తణుకు పురపాలక సంఘ పరిధిలో ఈ దిగువ తెల్పిన పనులకు ఇ-ప్రొక్యూర్ మెంటు ద్వారా టెండర్లు పిలువబడుచున్నవి.

		ఇ.సి.వి.(రూ.లక్షలలో)
1) 4 వీలర్ వాహనము (కారు) అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేయుట	1 నెం.	4.20
2) రోడ్డు పనులు	2 నెం.లు	13.18
3) డ్రయిను పనులు	5 నెం.లు	18.66
4) వాటర్ సప్లయి పనులు	1 నెం.లు	4.16
5) ఎలక్ట్రికల్ పనులు	1 నెం.	10.69

సంబంధిత వివరములకు www.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు ది.29-08-2023వ తేదీ నుండి చూడవచ్చును.

సం/- **కమీషనర్, తణుకు పురపాలక సంఘం**

స్పందన అర్జీపై మళ్లీ విచారణ

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని అల్లూరు గ్రామంలో 2021లో గ్రామ బుక్ కీపర్ లలితకుమారి సూమారు రూ.7 లక్షల లోన్ రికవరీ నిధులు దుర్వినియోగం చేసిన విషయంపై అధికారులు రెండోసారి తిరిగి విచారించారు. ఈనెల 18వ తేదిన తొలి విడత విచారణ చేసిన అధికారులు మళ్లీ వచ్చి గ్రామంలో విచారణ చేపట్టారు. ఏలూరు డిఆర్‌డిఎ కార్యాలయం నుంచి డిపిఎలు వచ్చి సభ్యుల సమక్షంలో విచారణ చేశారు. ఈ సందర్భంగా గ్రామ సంఘం సభ్యులను, అప్పటి విధుల్లో ఉన్న ఎంఎస్‌సిసి అమ్మాజీ, ఎపిఎం తిరుపతయ్య, విఒఎ లలితకుమారిని గ్రామ సమైఖ్య సంఘం సభ్యుల సమక్షంలో విచారించారు. గ్రూపు సభ్యుల నుంచి స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఈ విచారణలో ఎసి శోభన్‌బాబు, డిపిఎంలు సుబ్బారావు, భూషణం, శ్యామలదేవి, శశికుమార్, బాపూజీ, ఎపిఎం బి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షుడు హరినాథ్ మృతి

నూజివీడు రూరల్ : పట్టణంలోని న్యూ ఎంప్లాయిస్ కాలనీలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవ అధ్యక్షులు పెనుగొండ హరినాథ్ బాబు(77) సోమవారం మృతి చెందారు. నూజివీడు నియోజకవర్గంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్‌కు దశాబ్దాల తరబడి సేవలు అందించి, అందరి మన్ననలు పొందారు. పలువురు వ్యాపారవేత్తలు సంతాపం వ్యక్తం చేశారు.

రాబోయే ఎన్నికలకు సిద్ధం కావాలి : జనసేన

ద్వారకాతిరుమల : రాబోయే ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని జనసైనికులకు నియోజకవర్గ నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు తెలిపారు. మండలంలోని గుణ్ణంపల్లి గ్రామంలో తరగల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకులు దొడ్డిగర్ల సువర్ణ రాజు సమక్షంలో జనసేన క్రియాశీలక సభ్యత్వం కిట్లను పంపిణీ చేశారు. సభ్యత్వాలు చేసిన వాలంటీర్ అంజన్ కుమార్, రాజశేఖర్‌ను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం గ్రామ క్రియాశీలక జనసైనికులు ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఎన్నుకొన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షులుగా మురళి, ఉపాధ్యక్షులు రాజశేఖర్, నాగేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ప్రతాప్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా దొడ్డిగర్ల సువర్ణ రాజు మాట్లాడుతూ ప్రజల్లోకి జనసేన చేపట్టబోయే కార్యక్రమాలు, ప్రభుత్వం చేస్తున్న అన్యాయాన్ని సమిష్టిగా తీసుకురావాలన్నారు. రాబోయే ఎన్నికల్లో జనసేన విజయానికి అందరం కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు సుధాకర్, ప్రసాద్, రమేష్, సుబ్బారావు, వీరేంద్ర, ప్రతాప్, బాలు, గ్రామ జనసైనికులు, వీర మహిళలు పాల్గొన్నారు.

మహారాజశ్రీ అమలాపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఓ.ఎస్.నెం. 174/2017

బిట్వీన్:
ముదునూరి వెంకట సోమరాజు ...వాది
అండ్
పెన్మెత్స వెంకట కృష్ణంరాజు ...ప్రతివాది

టు: పెన్మెత్స వెంకట కృష్ణం రాజు, తండ్రి: రామచంద్రరాజు, ఫ్లాట్ నెం.101, వినాయక మారుతి రెసిడెన్సీ 4వ వీధి, డో.నెం.1-12-1/2, ఆర్.కె.ఆదర్శ్ నగర్, భీమవరం, ప॥గో॥జిల్లా.

ఈ పై నెంబరు దావాను వాది మీపై మీరు వ్రాయించి ఇచ్చిన ప్రామిసరీ నోటు బాకీ అసలు ఫాయిదాలు తాలూకు వసూలు మున్నగు పరిహారములు కోరుచూ దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీకు సమన్లు నిమిత్తం మరియు మీ హాజరు నిమిత్తం వాయిదా **ది.01-9-2023వ తేదీ అయి ఉన్నది. కావున మీరు వాయిదా రోజున ఉదయం గం॥10:30 ని॥లకు పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని, అడ్వకేట్ వారి ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకోవలెను.** అట్లు కాని ఎడల మీ పరోక్షమందున తీర్మానింపబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి అనుమతితో)
శ్రీ కుచ్చర్లపాటి తాతంరాజు
శ్రీ గుత్తుల శ్రీనివాసరావు
అమలాపురం, అడ్వకేట్స్, ముమ్మిడివరం.
25-8-23. సెల్: 94400 41751

మహారాజశ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
E.P.No.07/2023
in O.S.No. 172/2018

D.H.R.:
Bandi Venkatesulu, S/o. Narasayya, Tadepalligudem.

J.D.R.:
Dirsipo Prasad, S/o. Veeranna, Moduggunta Village.

పై నెంబరు డిక్రీ బాకీకి గాను జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్థి **ది.14-09-2023వ సం॥రం తేదీన ఉదయం గం॥10:30 ని॥ల లగాయితూ పై కోర్టులో వేలం వేయబడును.** కావున కావలసిన వారు వచ్చి పాట షరతులు తెలుసుకొని పాడుకొనవచ్చును.

షెడ్యూలు

West Godavari District, Tadepalligudem Mandal with in the SRO of Tadepalligudem, in Madhavaram Village in R.S.No. 150/2k/1 (Old R.S.No.150/2) an extent of Ac.0.21 cents (in Ac. 1.07 1/4 in Pura Ac.1.85 cents) land with in the following boundaries. ***East:*** Land belonged to Maganti Basavayya. ***South:*** Land belonged to Kanneboyina Surya Rao. ***West:*** Land belonged to Dirsipo Danayya. ***North:*** Land belonged to Undrajavarapu Maani.

Within the above boundaries the above extent of Ac.0.21 Cents of land with all easementary rights there in.

Petitioner /DHR Value : Rs.2,00,000/-
Amin Value : Rs.4,20,000/-

డి.ధర్మరాజు
డి. హెచ్.ఆర్. తరుపు అడ్వకేట్
తాడేపల్లిగూడెం.